క్లుప్తంగా

నేడు రైతు సదస్సు

కల్వకుర్తి రూరల్: మండలంలోని సుద్దకల్ గ్రామపంచాయతీ ఆవరణలో శనివారం రైతు సదస్సు నిర్వహించనున్నట్లు ఏఈఓ బాలస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాబోయే వర్షా కాలానికి సంబంధించిన పంటల సాగు, విత్తనాలు తదితర విషయాలపై చర్చించే అవకాశం ఉందన్నారు. రైతులు ఈ సమావేశానికి హాజరై అన్ని విషయాలపై చర్చించాలని కోరారు.

దొడ్డు వరికి రూ.500 బోనస్ చెల్లించాలి



కొల్లాపూర్: సన్నాలు, దొడ్డు రకాలు అనే తేడా లేకుండా అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ చెల్లించాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పర్వతాలు డిమాండ్ చేశారు. శుక్రవారం కొల్లాపూర్‌లోని సీపీఎం కార్యాలయంలో ఆయన పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. సన్నాలకు మాత్రమే రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైంది కాదన్నారు. వరి ధాన్యం పండించే రైతులందరికీ సమాన న్యాయం చేయాలన్నారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శులు శివవర్మ, నర్సింహ, నాయకులు సురేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచాలి

చారకొండ: అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచి ఎన్నికలు నిర్వహించాలని బీజేపీ నాయకులు, ఓయూ విద్యార్థి నేత కిరణ్ డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం 33 శాతం రిజర్వేషన్లను 23 శాతానికి కుదించి స్థానిక ఎన్నికలు నిర్వహించడంతో గత ప్రభుత్వం చేసిన తప్పిదం, ప్రస్తుత ప్రభుత్వం చేయాకూడదని కోరారు.

ఎమ్మెల్యే పరామర్శ

కల్వకుర్తి రూరల్: మండలంలోని జిల్లెల్లలో ఇటీవల మృతిచెందిన కృష్ణయ్య, జంగయ్య కుటుంబాలను కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరామర్శించారు. వారి కుటుంబ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. జంగయ్య, కృష్ణయ్య కుటుంబ సభ్యులకు రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం చేశారు. బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్, చిత్తరంజన్‌దాసు, కాయితీ విజయ్‌కుమార్ రెడ్డి, రాములు పలువురు పాల్గొన్నారు.

బల్మూర్ మండలంలో..

బల్మూర్: మండలంలోని గోపాల్‌రావు నగర్ తండాలో శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందిన మాజీ ఎంపీటీసీ మిత్రు, గట్టుతుమ్మెన్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకుడు గణపతి రెడ్డి తండ్రి మృతిచెందడంతో వారి మృతదేహాల వద్దకు చేరుకొని ఎమ్మెల్యే వంశీకృష్ణ నివాళి అర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకటయ్య పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు చేపట్టండి



పెద్దకొత్తపల్లి: మండల పరిధిలోని మారేడుమాన్‌దిన్నె రోడ్డు గతేడాది కురిసిన వర్షాలకు కొట్టుకుపోయి కంకర తేలింది. ఈ రోడ్డుకు మరమ్మతు చేపట్టకపోవడంతో గుంతల రోడ్డుతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతిరోజూ ఈ రోడ్డుపై నుంచి అచ్చంపేట ఆర్టీసీ బస్సు కొల్లాపూర్, అచ్చంపేటకు ప్రయాణికులను చేరవేస్తుంది. ఈ రోడ్డుపై బస్సును నడిపేందుకు డ్రైవర్లు ఇబ్బందులు ఎదుర్కొంటు డ్యూటీకి రావడానికి ఆసక్తి చూపడం లేదు. కంకర తేలిన రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని మారేడుమాన్‌దిన్నె, యాపట్ల గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పైప్‌లైన్ లీకేజీ సరిచేయండి

ఉప్పునుంతల: మండల కేంద్రంలోని కొత్తరాం నగర్ వైపు వెళ్లే రోడ్డు మార్గంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ ఏర్పడటంతో తాగునీరు వృథాగా రోడ్డుపై పారుతూ.. బురదమయంగా మారింది. వాటర్ ట్యాంక్‌కు సమీపంలో ఈ లీకేజీ కావడంతో ఇళ్లలో కొళాయిల వెంట నీరు సరిగా రావడం లేదంటూ గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు, మిషన్ భగీరథలో పనిచేస్తున్న సిబ్బంది లీకేజీని సరిచేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. వారి అలసత్వంతో రోజుల తరబడి తాగునీరు వృథాగా అవుతుందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి పైప్‌లైన్ లీకేజీ సరిచేయించాలని కోరుతున్నారు.



తాగునీటి సమస్య లేకుండా చర్యలు

- ప్రతి గ్రామానికి విద్యుత్, రోడ్డు సౌకర్యమే ధ్యేయం
- ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ
- బల్మూర్ మండల సర్వసభ్య సమావేశం



బల్మూర్ మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ

బల్మూర్: ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనుల్లో ప్రజలు తమవంతుగా సామాజిక బాధ్యత కలిగి ఉండేలా అధికారులు, ప్రజాప్రతినిధులు వారికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ సూచించారు. శుక్రవారం ఎంపీపీ వేనేపల్లి అరుణ అధ్యక్షతన నిర్వహించిన బల్మూర్ మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే హాజరై ఆయా శాఖల వారీగా ఎజెండాలో పొందుపర్చిన అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రస్తుత వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, శిథిలావస్థకు చేరిన నీటి ట్యాంక్‌లను గుర్తించి నివేదిక అందజేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మధుబాబును ఆదేశించారు. పీఆర్, ఆర్అండ్‌బీ రోడ్ల మరమ్మతులకు త్వరలోనే నిధులు మంజూరు చేసి, పనులు చేపడుతామన్నారు. ప్రభుత్వ పనులకు అడ్డువచ్చే వారిపై కఠిన చర్యలు ఉంటాయని తెలియజేశారు. ప్రతి గ్రామానికి, తండాకు, గూడెనికి రోడ్డు, తాగునీరు, విద్యుత్ వంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమన్నారు. మండలంలో అధ్వానంగా ఉన్న రోడ్ల మరమ్మతులు, కొత్త వాటికి ప్రతిపాదనలు తయారు చేసి నివేదిక ఇవ్వాలని ఏఈ శ్రీనివాస్‌ను ఆదేశించారు. ఆరేళ్ల కింద నిధులు మంజూరైన రోడ్లకు ఇంకా పనులు చేయకపోవడంపై ఎమ్మెల్యే విచారం వ్యక్తం చేశారు. రేషన్ దుకాణాలు లేని ఆమ్లెట్ గ్రామాల్లో లబ్ధిదారుల సౌకర్యార్థం ఐదు రోజుల పాటు డీలర్లతో సరుకులు ఇప్పించాలని తహసీల్దార్‌కు సూచించారు. వచ్చే నెల 7 నుంచి కొత్త రేషన్ కార్డులు అందజేస్తామని, వాటి ఆధారంగా కొత్తగా రేషన్ దుకాణాలు కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈజీఎస్ అధికారులు చర్యలు తీసుకొని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు.

ఉమామహేశ్వర రిజర్వాయర్‌పై చర్చ

బల్మూర్, అనంతవరం శివార్లలో నిర్మించనున్న ఉమామహేశ్వర రిజర్వాయర్‌పై ఈ నెల 27న అచ్చంపేటలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆయా గ్రామాల ప్రజలు, పెద్దలు, ప్రజాప్రతినిధులు, ఇంజనీర్లు, అధికారులతో కలిసి బహిరంగ చర్చ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే వంశీకృష్ణ తెలిపారు. ఫేజ్–1 ద్వారా రూ.15,031 కోట్లతో చేపట్టబోయే ఈ రిజర్వాయర్‌పై ప్రజలతో వారి అభిప్రాయలను తీసుకొని ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలపై అక్కడే ఇంజనీర్లతో లెవల్స్ ఫిజిబులిటీపై చర్చించనున్నట్లు చెప్పారు. ఈ రిజర్వాయర్‌తో రైతులకు నష్టం వాటిల్లకుండా 2.67 టీఎంసీ సామర్థ్యం నుంచి 2.05 టీఎంసీల సామర్థ్యంతో 15 రోజుల్లో పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. వైస్ ఎంపీపీ నారాయణ, తహసీల్దార్ శైలేంద్రకుమార్, ఎంపీడీఓ విజయభాస్కర్, సీడీపీఓ లక్ష్మి, ఎంఈఓ రామారావు, ఏఓ మహేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనారసింహస్వామి రథోత్సవం



విగ్రహాలకు చక్రస్నానం చేయిస్తున్న పూజారులు



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

వెల్దండ: మండల పరిధిలోని బైరాపూర్‌లో స్వయంభు శ్రీలక్ష్మీ నారసింహస్వామి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. రథోత్సవాన్ని పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారి. స్వామివారి ఉత్సవ విగ్రహాలను వేదమంత్రోత్సవాలతో పూరోహితులు తీసుకొచ్చి రథోత్సవంపై ఉంచారు. రథాన్ని గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో లాగారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, ఏఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. అనంతరం చక్రస్నానం, దీపోత్సవం, ఆశీర్వచనం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో జగన్మోహన్ రెడ్డి, దార్ల కుమార్, యాదయ్య, రమేష్‌గౌడ్, రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

తాడూరు: మండలంలోని శిర్సవాడలో ఐదు రోజుల పాటు నిర్వహించిన లక్ష్మీనారసింహస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. స్వామివారికి చక్రస్నానంతో పాటు బోనాలతో మహిళలు స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల వెంట మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు.



బైరాపూర్‌లో రథాన్ని లాగుతున్న భక్తులు, గ్రామస్తులు

శిక్షణ ఏఎస్ఓలకు సన్మానం



అధికారులను సన్మానించిన గ్రామస్తులు

తాడూరు: మండలంలోని అల్లాపూర్‌లో మూడు రోజుల పాటు గ్రామస్తులతో మమేకమై కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలు, తీరుతెన్నులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి సర్వే నిర్వహించిన శిక్షణ ఏఎస్ఓలకు ముగింపు సందర్భంగా శుక్రవారం ఘనంగా సన్మానించారు. గ్రామంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు వాటి వివరాలను సంక్షేమ పథకాలు ప్రజలకు ఎలా అందుతున్నాయో అనే విషయాలను ఐదుగురు ఏఎస్ఓలు మూడు రోజుల పాటు గ్రామంలో ఉండి ప్రజలతో కలిసి విషయాలు తెలుసుకున్నారు. ముఖ్యంగా ఉపాధి హామీ పథకం, పల్లెప్రకృతి వనాలు, శ్మశానవాటికలు, డంపింగ్ యార్డ్‌లు, అంగన్‌వాడీ కేంద్రాల పనితీరుపై సర్వే నిర్వహించారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్ రమేష్‌బాబు

తెలకపల్లి: రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువు మందులు అమ్మితే చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు రమేష్‌బాబు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దాసుపల్లిలోని రైతువేదికలో విత్తన, ఎరువులు, పురుగు మందుల డీలర్లకు, వ్యవసాయ విస్తరణ అధికారులకు సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. డీలర్లు తప్పనిసరిగా రైతులకు నాణ్యమైన విత్తనాలు మాత్రమే అమ్మాలని సూచించారు. నాసిరకం విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు. రశీదులో సంబంధించిన విత్తనాలు, ఎరువుల వివరాలు ఇవ్వాలన్నారు. స్టాక్ రిపోర్ట్ తప్పనిసరిగా దుకాణంలో నమోదు చేసుకోవాలన్నారు. కాలపరిమితి అయిపోయిన విత్తనాలను అమ్మరాదని, తప్పకుండా ఎరువులను డీపీఓఎస్ మిషన్ ద్వారానే అమ్మాలని సూచించారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు మాత్రమే విక్రయించాలని తెలియజేశారు. ఎస్ఐ నరేష్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎవరైనా లూస్ విత్తనాలు అమ్మితే.. వెంటనే సమాచారం ఇవ్వాలని, వారిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సందీప్‌కుమార్‌రెడ్డి, డీలర్లు, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

వేదిక్ మ్యాథ్స్‌పై అవగాహన సదస్సు

కొల్లాపూర్: రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేదిక్ మ్యాథ్స్‌పై ఈ నెల 26న విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ వెల్లడించారు. పట్టణంలోని మినీ స్టేడియంలో ఉదయం 9 గంటల నుంచి 1 గంట వరకు సదస్సు జరుగుతుందన్నారు. మ్యాథ్స్‌పై విద్యార్థుల్లో ఉన్న భయాందోళనలు పోగొట్టడానికి ఈ సదస్సు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు అవగాహన సదస్సును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సర్పంచ్ స్థానాన్ని ఎస్సీలకు రిజర్వ్ చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న కేవీపీఎస్ నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: కోడేరు మండలంలోని జనుంపల్లి సర్పంచ్ స్థానాన్ని ఎస్సీలకు రిజర్వ్ చేయాలని, మండలంలో ఎస్సీ రిజర్వ్ స్థానాలు పెంచాలని శుక్రవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో వినతి అందజేశారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ నాయకులు మాట్లాడారు. కోడేరు మండలం, జనుంపల్లితో పాటు అధికంగా దళితులకు సర్పంచ్ స్థానాలు కేటాయించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న కోరారు. జనుంపల్లిలో ఒక్క పర్యాయం కూడా ఎస్సీ రిజర్వేషన్ సర్పంచ్‌గా దక్కలేదని, ఎప్పుడు ఎన్నికలు జరిగినా బీసీలకే రిజర్వేషన్ ఇస్తున్నారని, ఈ పర్యాయం ఎస్సీలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామంలో 600 మంది దళితులే ఉన్నారని వారు ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు శివశంకర్, వరప్రసాద్, ధర్మేంద్ర, శ్రీను, నాగేశయ్య తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేటలో దాడులు, ప్రతిదాడులు



ఆస్పత్రిలో పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట రూరల్: అచ్చంపేటలో ఎన్నడూ లేని విధంగా వ్యక్తిగతంగా దాడులు, ప్రతిదాడులు చేసుకుంటూ సవాళ్లు విసురుకుంటున్నారు. తాజాగా శుక్రవారం అచ్చంపేట పట్టణంలోని శ్రీశైలం–మహబూబ్‌నగర్ ప్రధాన రహదారి సాయిరాం థియేటర్ సమీపంలో బీఆర్ఎస్ కౌన్సిలర్ సుంకరి నిర్మల భర్త సుంకరి బాల్‌రాజు, అతని అనుచరులు సాయినగర్ కాలనీకి చెందిన కాంగ్రెస్ నాయకుడు లాలుయాదవ్, అంజియాదవ్‌ను చితకబాదారు. కర్రలు, కత్తులతో దాడి చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు.

అసలేం జరిగింది...

ఈ నెల 13న జరిగిన పార్లమెంట్ పోలింగ్ సందర్భంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య మాటామాటా పెరిగింది. ఇరువర్గాలు తోసుకున్నారు. ఈ నెల 14న బీఆర్ఎస్ కౌన్సిలర్ నిర్మల ఇంటిపై కాంగ్రెస్‌కు చెందిన లాలుయాదవ్, అతడి అనుచరులు దాడి చేశారు. కౌన్సిలర్ మరిది మహేష్‌కు గాయాలవ్వగా హైదరాబాద్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయించారు. అచ్చంపేట పోలీస్‌స్టేషన్ ఎదుట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రాస్తారోకో చేశారు. మరుసటి రోజు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు దాడిలో గాయపడ్డ బీఆర్ఎస్ నాయకులను పరామర్శించి జిల్లా కేంద్రంలో ఎస్పీకి వినతి అందజేశారు. ఇరువర్గాలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. పోలీసులు వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. ఇదే అదునుగా భావించిన సుంకరి బాల్‌రాజు వర్గీయులు అదును చూశారు. శుక్రవారం లాలుయాదవ్, అంజియాదవ్ ఇద్దరు తమ సమీప బంధువు చనిపోతే చూసొద్దామని సాయిరాం థియేటర్ సమీపంలో రోడ్డు పక్కన నిలబడి ఉండగా.. ఒక్కసారిగా సుంకరి బాల్‌రాజు, సుంకరి లింగం, సురేష్, బాలకృష్ణ, రాజు తదితరులు దాడి చేశారు. కర్రలు, కత్తులో దాడి చేయడంతో లాలుయాదవ్ తలకు తీవ్ర గాయమైంది. అంజియాదవ్ కాలు విరిగింది. ప్రత్యర్థుల నుంచి తప్పించుకుని బంధువుల సాయంతో స్థానిక ప్రాంతీయ ఆస్పత్రిలో చేరారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, దాడి చేసిన వారు పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయారని ఎస్ఐ రాములు తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పరామర్శించారు. మెరుగైన వైద్యం నిమిత్తం ఆస్పత్రి వైద్యులు హైదరాబాద్‌కు రెఫర్ చేశారు.

నిబంధనలు పాటించకుంటే వాహనాలు సీజ్



అచ్చంపేట రూరల్: ప్రభుత్వ నిబంధనలు పాటించని వాహనాలను సీజ్ చేస్తామని డీటీఓ చిన్నబాలు హెచ్చరించారు. శుక్రవారం అచ్చంపేట ప్రాంతంలో పలు వాహనాలను పరిశీలించారు. ఎస్ఎస్ఆర్ క్రషర్ హాజీపూర్ నుంచి డిండి వైపు వెళ్తున్న ఓ టిప్పర్‌ను ఆపి పరిశీలించారు. అనుమానం వచ్చి వేయింగ్ మిషన్ వద్ద చూడగా 20 టన్నులకు గానూ 36 టన్నులు ఉండటంతో టిప్పర్‌ను సీజ్ చేసి అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

తాడూరు: మండలంలోని ఓబులాపూర్‌కి చెందిన శివకుమార్, ధన్వాడకి చెందిన యువతిని శుక్రవారం ప్రేమ వివాహం చేసుకొని పోలీసులను ఆశ్రయించారు. ఇరు కుటుంబ సభ్యులు పెళ్లికి నిరాకరించడంతో చేసేది లేక శుక్రవారం ఓ దేవాలయం వద్ద పెళ్లి చేసుకున్నామని చెప్పారు. భద్రత కల్పించాలంటూ ప్రేమ జంట పోలీసులను ఆశ్రయించారు. ఇరు కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తామని ఎస్ఐ శ్రీనివాసులు తెలియజేశారు.

బీఆర్ఎస్‌లో యువకుల చేరిక



వెల్దండ: మండల పరిధిలోని లింగారెడ్డిపల్లికి చెందిన వివిధ పార్టీల యువకులు దాదాపుగా 20 మంది శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరుతున్న వారికి సింగిల్‌విండో డైరెక్టర్ శేఖర్‌ముదిరాజ్ పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ప్రతి గ్రామంలో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నిరంజన్, మధుసూదన్‌రెడ్డి, నర్సింహముదిరాజ్, కొండల్‌యాదవ్, సోమయ్య, శ్రీనివాసులు, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మట్టి తరలింపుపై ఫిర్యాదు



వెల్దండ: మండల పరిధిలోని తిరుపతిచెరువులో అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ ఏఈ తిరుపతి నాయక్ శుక్రవారం వెల్దండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కొంత మంది నల్లమట్టి తరలించడానికి పాల్పడుతున్నట్లు ఏఈకి సమాచారం వచ్చిందన్నారు. వెంటనే చెరువులో పరిశీలించి అక్కడ యంత్రాలను తీసుకొచ్చినట్లు గుర్తించారు. వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఐ రవికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కల్వకుర్తి రూరల్: మండలంలోని గుండూరులో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమ రవాణా చేస్తున్న తుమ్మల భగవంత్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి ఇసుక ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు కల్వకుర్తి ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. ఇసుక అక్రమ రవాణా చేసేవారిపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మాధవరెడ్డి హెచ్చరించారు.

ఘనంగా బొడ్రాయి వార్షికోత్సవం

ఉప్పునుంతల: మండలంలోని పెనిమిళ్లలో శుక్రవారం బొడ్రాయి ప్రతిష్ట మొదటి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో బొడ్రాయి వద్ద పూజలు చేశారు. అదేవిధంగా బోనాలతో ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవతలకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఉత్సవంలో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవంలో నాయకులు తిప్పర్తి నర్సింహారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వీరయ్య, గ్రామపెద్దలు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల నిర్వహణపై శ్రద్ధ అవసరం



కంపోస్టు షెడ్ పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఇసాక్

చారకొండ: గ్రామాల్లో అభివృద్ధి పనుల నిర్వహణపై గ్రామపంచాయతీ కార్యదర్శులు, సంబంధిత నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ అన్నారు. మండలంలోని శాంతిగూడెం, గైరాన్ తండా, రామచంద్రాపురం గ్రామాల్లో శుక్రవారం ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ అభివృద్ధి పనులు, నర్సరీలు, వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులు, నూతన జీపీ భవనాలు పరిశీలించారు. డంపింగ్ యార్డులో కంపోస్టు ఎరువు తయారీని పరిశీలించారు. వారి వెంట ఎంపీఓ వెంకటేష్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు హారికారెడ్డి, రాజు, పవన్ తదితరులు ఉన్నారు.

ప్రతి మొక్కను రక్షించుకోవాలి



మొక్కలకు నీరు అందిస్తున్న ఎంపీడీఓ సత్యపాల్

వెల్దండ: హరితహారంలో నాటిన ప్రతిమొక్కను రక్షించుకోవాలని ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రాచూర్, తిమ్మినోనిపల్లి గ్రామాల్లో పర్యటించి నర్సరీలు, డంపింగ్ యార్డులను పరిశీలించారు. వాటరింగ్ డే సందర్భంగా మొక్కలకు నీరు పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హరితహారంలో నాటిన ప్రతి మొక్కను రక్షించుకోవాలన్నారు. వేసవి కావడంతో మొక్కలకు ట్యాంకర్ల ద్వారా నీరు అందించాలన్నారు. రైతులకు ఉపయోగపడే మొక్కలను పెంచాలన్నారు. ఏపీఓ ఈశ్వర్‌జీ, ఈసీ దేవేందర్‌గౌడ్, కార్యదర్శి పద్మ తదితరులు ఉన్నారు.

గాలీవాన బీభత్సం



బొల్లంపల్లిలో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

వెల్దండ: మండల కేంద్రంతో పాటు బొల్లంపల్లి, చెదురుపల్లి, రాచూర్, చెర్కూర్ తదితర గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం గాలీవాన బీభత్సం సృష్టించింది. మండల కేంద్రంలో చెట్లకొమ్మలు విరిగి విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. స్తంభాలు నేలకొరిగాయి. అదే విధంగా బొల్లంపల్లిలో ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరా చేస్తామని ఏఈ సూర్యంనాయక్ పేర్కొన్నారు.

‘హత్య రాజకీయాలు సరికావు’

కొల్లాపూర్ రూరల్: కొల్లాపూర్‌లో హత్య రాజకీయాలు సరికావని కాంగ్రెస్ పార్టీ కొల్లాపూర్ నియోజకవర్గ వాల్మీకి సంఘం నాయకులు అన్నారు. శుక్రవారం పట్టణంలో వారు విలేకరులతో మాట్లాడారు. మంత్రి జూపల్లిపై బీఆర్ఎస్ నాయకులు నిరాదరణ ఆరోపణలు చేస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. కొల్లాపూర్‌లో గతంలో మాజీ ఎమ్మెల్యే పెంట్లవెల్లి, ముత్తిరెడ్డిపల్లి, మైలారం, దేదినేనిపల్లి గ్రామాల్లో అధికార పార్టీ అండతో ఎన్నో దాడులు, హత్యలు చేయించారని ఆరోపించారు. మంత్రి జూపల్లి కొల్లాపూర్‌ను 20 సంవత్సరాలు పాలించారని ఎక్కడా కూడా అన్యాయాలు, అక్రమాలు, హత్యలు జరగలేదన్నారు. లక్ష్మిపల్లిలో హత్యకు గురైన శ్రీధర్ రెడ్డి కుటుంబానికి సానుభూతి తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వాల్మీకి నాయకులు రాముడు, వెంకటేష్, మల్లయ్య, ప్రసాద్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీహాల్ స్థలాన్ని కేటాయించాలి

కొల్లాపూర్ రూరల్: కొల్లాపూర్ పట్టణంలో రాజవారి బంగ్లా సమీపంలోని స్థలాన్ని ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ భవనానికి కేటాయించాలని ముదిరాజ్ సంఘం నాయకులు కమిషనర్‌కు వినతి అందజేశారు. ఈ సందర్భంగా వారు కొంత సేపు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు పాలమూరు జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు న్యాయవాది గొంగలి శ్రీకాంత్ మద్దతు తెలుపుతూ మాట్లాడారు. గతంలో ముదిరాజ్‌లకు ఆ స్థలాన్ని ప్రభుత్వం ఇచ్చిందన్నారు. ప్రస్తుతం కొందరు అడ్డంకులు సృష్టిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు తిరుపతి, కుమారస్వామి, సహదేవుడు, వెంకటస్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వటువర్లపల్లిలో తాగునీటి సమస్య



ట్యాంకరు నీటిని పట్టుకుంటున్న మహిళలు

మన్ననూర్: అమ్రాబాద్ మండలం వటువర్లపల్లిలో తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడిందని గ్రామస్తులు వాపోతున్నారు. వేసవి కావడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయాయని, దీంతో గ్రామానికి పెద్ద దిక్కుగా ఉన్న కానుగుల బావిలో నీటి జలాలు పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పరిసరాల్లోని రెండు బోరు బావుల్లో కూడా నీరు అడుగంటిపోయింది. ఈ క్రమంలో గ్రామ ప్రజలకు తాగునీటికి తిప్పలైందని వాపోతున్నారు. నాలుగైదు కుటుంబాల వారు కలిసి డబ్బులు చెల్లించి ఇతర ప్రాంతం నుంచి ట్యాంకర్లతో తాగునీటిని తెప్పించుకుని కాలం గడిపే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి సంబంధించిన స్పెషల్ ఆఫీసర్‌కు తాగునీటి సమస్య గురించి తెలియజేసినా ఫలితం ఉండటంలేదని, సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించి ఆదుకోవాలని కోరుతున్నారు.